క్లుప్తంగా

పర్మినెంట్ కార్మికుల బదిలీలు నిలిపివేయాలని వినతి



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ సలీంతో చర్చిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్ కార్మికుల బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు యూనియన్ నాయకులు మంగళవారం డైరెక్టర్(ఆపరేషన్స్) సలీం జి పురుషోత్తమన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మెకానికల్ అనుభవం కలిగిన సీనియర్ కార్మికులను బదిలీ చేయడం అన్యాయమన్నారు. మెకానికల్ మెయింటెనెన్స్‌లో అనుభవం కలిగిన కార్మికులను ఆపరేషన్స్‌కు బదిలీ చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. స్టాండింగ్ ఆర్డర్స్‌కు వ్యతిరేకంగా కార్మికుల బదిలీలు జరిగాయన్నారు. బదిలీలను ఆపడంతో పాటు భవిష్యత్తులో బదిలీలపై కార్మిక సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు, ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ, నాయకులు చీకటి శ్రీనివాస్, టి. సత్యనారాయణ, దేముడు తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న కార్మికులు

విశాఖ విద్య: ఏఎన్–32 విమాన ప్రమాదంలో అమరులైన వారికి తోటి కార్మికులు ఘన నివాళులర్పించారు. ఎన్‌ఏడీలోని నేవల్ ఆర్మమెంట్ డిపో ప్రధాన గేటు ఎన్‌ఏసీఎస్‌అండ్‌డబ్ల్యూ యూనియన్ ఆధ్వర్యంలో 2016లో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల చిత్రపటాలను ఉంచి నివాళులర్పించారు. దేశ సేవలో ప్రాణాలు అర్పించిన వారిని స్మరించుకోవడం మన బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. అన్ని విభాగాల ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేవల్ ఆర్మమెంట్ డిపో మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. చీఫ్ జనరల్ మేనేజర్ దివాకర్ జయంత్ ఏఎన్ –32 ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సహోద్యోగుల త్యాగాలను గుర్తు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



ములగాడకు వెళ్లే మార్గంలో వంతెనపై కూలిన గోడ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గొందేశివానిపాలెం నుంచి ములగాడ వెళ్లే మార్గంలో గెడ్డపై వంతెన గోడ కూలిపోయింది. ఇది ములగాడకు వెళ్లే మార్గంలో ఉండడంతో ఆ వాహనదారులు భయపడుతున్నారు. వంతెనపై రక్షణ గోడ లేకపోవడం వల్ల రాత్రి సమయాల్లో వాహనాలు అదుపు తప్పితే గెడ్డలో పడి ప్రమాదానికి గురి కాకతప్పదు. సమస్యపై అధికారులు స్పందించాలని రెండు కాలనీల వాసులు కోరుతున్నారు.

పోరాటయోధుడు దాశరథి

సీతంపేట: తెలంగాణ ఉద్యమ కవి, దివంగత దాశరథి కృష్ణమాచార్య శత జయంత్యుత్సవ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఘనంగా జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, విశ్లేషకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు సభాధ్యక్షత వహించారు. గత ఏడాది ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరిగిన దాశరథి ఉత్సవాలను గుర్తు చేసుకుంటూ తెలంగాణ కవి అయినప్పటికీ దాశరథి తెలుగు తల్లిని ప్రస్తావించిన వైనాన్ని కొనియాడారు. ప్రముఖ సాహితీ విశ్లేషకులు డాక్టర్ డీవీ సూర్యారావు దాశరథి ఉద్యమ సాహిత్యంపై లోతైన విశ్లేషణ చేశారు. 'ఆ చల్లని సముద్ర గర్భం' పద్యంతో ప్రారంభించి, దాశరథి రచనలన్నింటినీ స్పృశించారు. కవికి ప్రాంతీయ భేదం ఉండదని ఉద్ఘాటించిన ఆయన, దాశరథిని ఒక సమాజవాది, పోరాటయోధుడిగా అభివర్ణించారు. జైల్లో ఉండి కూడా కవిత్వం మరువని మహోన్నత సాహితీవేత్త' అని ప్రశంసించారు.రైతుల గురించి దాశరథి కవిత్వాన్ని వివరిస్తూ, ఆయన 'దిగిపో' అని గర్జించిన ధైర్యశాలి అని, తిమిరంతో సమరం చేసిన మహాకవి అని విశ్లేషించారు. ప్రఖ్యాత వ్యాఖ్యాత రాంభట్ల నృశింహశర్మ దాశరథి రాసిన చలన చిత్ర గీతాలపై మాట్లాడారు. 'ఆ రజనీకర బింబం' పాటతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు.

సర్కారు వైద్యానికి సుస్తీ

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో వేధిస్తున్న మందుల కొరత
- రోగనిర్ధారణ పరీక్షల్లో కోత
- పేదోడికి భారంగా మారిన వైద్యం
- ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్న ప్రజలు
- యూపీహెచ్‌సీలకు తగ్గుతున్న రోగుల తాకిడి



63వ వార్డులోని యూపీహెచ్‌సీ



40వ వార్డు యూపీహెచ్‌సీలోని మందుల గది

సింధియా: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం **జీవీఎంసీ40,63** వార్డుల్లో యూపీహెచ్‌సీలు ఏర్పాటు **చేసింది.** అన్ని వసతులు ఉండేవి. దీంతో **రోగులకు** నాణ్యమైన వైద్యం అందేది. **నేడు** పరిస్థితి మారిపోయింది. యూపీహెచ్‌సీలకు రోగుల సంఖ్య తగిపోతుంది. మందుల కొరత, సిబ్బంది కొరత, సరైన వైద్యం అందక పోవడంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు మొగ్గుచూపుతున్నారు.

సౌకర్యాల లేమి

జీవీఎంసీ 40, 63వ వార్డుల్లోని యూపీహెచ్‌సీల్లో వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలు సరిపడా లేకపోవడంతో రోగులు నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. రోగుల వెళ్లడానికి సైతం సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. యూపీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు పూర్తి స్థాయిలో చేయడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీలు నేడు వెలవెలబోతున్నాయి.

> కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా రోగ్యాన్ని గాలికి వదిలేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణను పట్టించుకోవడం లేదు. ప్రధానంగా యూపీహెచ్‌సీల్లో వైద్య సేవలను తగ్గించేసింది. స్పెషలిస్ట్ వైద్యుల సేవలకు మంగళం పాడింది. వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో కోత పెట్టింది. మందులను కూడా పూర్తి స్థాయిలో సరఫరా చేయడం లేదు. ఫలితంగా సర్కారు యూపీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య తగ్గిపోతుంది. ఒక వేళ వచ్చినా అవసరమైన మందులు లేకపోవడం.. వ్యాధి నిర్ధారణ పరీక్షలు బయట చేయించుకోవాల్సి రావడంతో పేదలు సైతం ప్రైవేటు వైద్యుల వద్దకే పరుగులు తీస్తున్నారు.

సిబ్బంది కొరత

యూపీహెచ్‌సీల్లో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కొరత కారణంగా రోగులకు సరైన వైద్యం అందడంలేదు. దీంతో మొదట్లో రోజుకు 60–80 వరకు నమోదు అయ్యే ఓపీ ప్రస్తుతం రోజుకు 20–40 వరకు నమోదు కావడంలేదు. ఇక రోగులు వచ్చినప్పటికి వైద్యసిబ్బంది రాసి ఇచ్చే మందులు లేకపోవడంతో యూపీహెచ్‌సీలకు రావడం లేదు.

ప్రైవేటు ఆస్పత్రులకే మొగ్గు

వేగవంతమైన వైద్య చికిత్స యూపీహెచ్‌సీల్లో దొరకకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు మొగ్గు చూపుతున్నారు. వైద్య సిబ్బంది సమయానికి రాకపోవడం, వైద్యులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడం వల్ల ప్రజలు యూపీహెచ్‌సీల వైపు రావడమే మానేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం ఖర్చుతో కూడుకున్నదైనా వెళుతున్నామని రోగులు చెబుతున్నారు.

మందుల కొరత



63వ వార్డు యూపీహెచ్‌సీలోని మందుల గది

యూపీహెచ్‌సీలో అవసరమైన మందులు **లభించ**కపోవడంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లిపోతున్నారు. యూపీహెచ్‌సీలకు కేటాయించే నిధులు తగ్గించడంతో మందుల కొరత ఏర్పడుతోంది. ఫలితంగా రోగులు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రోగి చెంతకు వైద్య సేవలు అందించేది. అదే విధంగా వైద్యులను ఇంటికే పంపించి వైద్య పరీక్షలు చేయించేది. దీంతో పేదరోగులకు ఉచిత వైద్య సేవలంతో పాటు మందులు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూపీహెచ్‌సీ నిర్వహణ గాలికి వదిలేయడంతో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

జ్వరం అని వెళ్తే పట్టించుకోలేదు



జ్వరం అని వెళ్తే వైద్య సిబ్బంది కనీసం పట్టించుకోలేదు. ఓపీ నమోదు చేసిన అరగంట తర్వాత డాక్టర్ చూసి రక్త పరీక్షలు చేయాలని చెప్పారు. అందుకు కావాల్సిన సౌకర్యాలు లేకపోవడంతో బయట రక్త పరీక్షలు చేయించుకున్నాను. పదిరోజులు వరకు జ్వరం తగ్గకపోవడంతో తిరిగి ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకున్నాను. యూపీహెచ్‌సీల్లో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలి.

– ప్రమీల, మల్కాపురం

వైద్య సౌకర్యాలు పెంచాలి



గతంలో వైద్య సౌకర్యాలు చాలా బాగుండేవి. ఇటీవల కాలంలో వైద్య సౌకర్యాలు తగిపోయాయి. మందులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వ్యాధి తగ్గడంలేదు. యూపీహెచ్‌సీల్లో వసతులు మెరుగుపర్చాలి. స్పెషలిస్ట్ సేవలు పునరుద్ధరించి పేదలకు ఉచిత వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

– ఈశ్వరరావు, 63వ వార్డు



40వ వార్డులోని యూపీహెచ్‌సీ

మహిళా రక్షణలో ప్రభుత్వం విఫలం



కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా మహిళ సంఘ నాయకురాలు

మల్కాపురం: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకురాలు రారాడ పోలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. 61వ వార్డు వెంకన్నపాలెం వద్ద గల సీఐటీయూ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన ఐద్వా పదో మహాసభలో ఆమె ఐద్వా పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పోలమ్మ మాట్లాడుతూ, మహిళలకు రక్షణ కల్పించడంలో ఈ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. ఐద్వా మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్. విమల, గతంలో మహిళల సమస్యలపై చేసిన పోరాటాలను వివరించారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. పద్మా, వై. సత్యవతిలు ఐద్వా వ్యవస్థాపకులైన వైదాడ ధర్మారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం దేశంలోనే అతి పెద్ద సంఘం అని, మహిళలపై జరిగే దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి అనేక మంది యువతులకు అండగా నిలిచిందని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా ఐద్వా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షురాలుగా బి. మమత, కార్యదర్శిగా ఆర్. విమల, కోశాధికారిగా వై. కళ్యాణి తదితరులను ఎన్నుకున్నారు.

వృద్ధుల అనుభవాలు గొప్ప మానవ వనరులు



వృద్ధులకు జ్ఞాపిక ఇస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం



కూచిపూడి నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

మల్కాపురం: వృద్ధులే దేశ సంపద , వారు గొప్ప మానవ వనరులని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ కుమారి అన్నారు. గ్రాండ్ పేరెంట్స్ డే సందర్భంగా కళాశాల ఆవరణలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ప్రిన్సిపాల్ ప్రేమ కుమారి పలువురు వృద్ధులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించారు.ఆమె మాట్లాడుతూ తాతయ్యలు,నాయనమ్మలు,అమ్మమ్మలు,తమ మనవళ్లు, మనవరాళ్లకు విలువలను,సభ్యతను,సంస్కారాన్ని తెలియజేయాలని కోరారు.భారతదేశ సాంస్కృతిక మూల బిందువు కుటుంబ ఆత్మీయ, అనుబంధాలేనని వివరించారు. సమాజంలో గ్రాండ్ పేరెంట్స్ పాత్ర పై జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,సీనియర్ హిందీ అధ్యాపకురాలు ఎ.ఆదిలక్ష్మి వివరించారు. మాజీ సైనికుడు లక్ష్మణరావును ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థినుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

రాత్రి వేళ విద్యుత్ కోతలు



మల్కాపురం మరిడిమాంబ ఆలయం వెనుక ప్రాంతంలో అంధకారం



మల్కాపురం గొల్లవీధి ప్రాంతంలో అంధకారం

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు పరిధిలో రాత్రి వేళల్లో తరచూ ఎదురవుతున్న అనాధికార విద్యుత్ కోతలు ఆ ప్రాంత నివాసితులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతుండగా, ఈ విద్యుత్ కోతలు వారి కష్టాలను మరింత పెంచుతున్నాయి. ఇటీవలి కాలంలో మల్కాపురం మరిడిమాంబ ఆలయం వెనుక ప్రాంతం, మల్కాపురం గొల్లవీధి వంటి ప్రాంతాల్లో వారానికి కనీసం రెండు సార్లు అనాధికార విద్యుత్ కోతలు ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రిపూట విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్కపోతకు గురై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మల్కాపురం ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఏఐటీటీ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతం



కంచరపాలెం పాత ఐటీఐలో ప్రాక్టికల్ పరీక్షలు పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్ వద్ద ఉన్న పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌లకు నిర్వహించిన ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ (ఏఐటీటీ) ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. జూలై 17న ప్రారంభమైన ఈ పరీక్షలు ఎటువంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యాయని ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డి.వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ పరీక్షలను రీజినల్ డైరెక్టర్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ (ఆర్డీఏటీ) నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీకాంత్, డిపార్ట్‌మెంటల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి సాల్మన్, జోన్–1 రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (ఆర్డీడీ) అధికారి ఆర్.వి. రమణ పర్యవేక్షించారు. పరీక్షల్లో ఎటువంటి అవకతవకలు, మాల్‌ప్రాక్టీస్‌కు తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి శ్రీనివాసరావు విశేష కృషి



కోక్‌ఓవెన్స్ జీఎం శ్రీనివాసరావును సత్కరిస్తున్న విభాగం అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కోక్‌ఓవెన్స్ జనరల్ మేనేజర్ వై.వి.ఆర్. శ్రీనివాసరావు విశేషంగా కృషి చేసారని కోక్‌ఓవెన్స్ విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. శ్రీనివాసరావు ఈనెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా మంగళవారం విభాగంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 180 పుషింగ్స్ ఉత్పత్తి జరిగే సమయంలో శ్రీనివాసరావు కోక్‌ఓవెన్స్‌కు వచ్చి 380 పుషింగ్స్‌కు తీసుకువెళ్లారని అభినందించారు. రష్యా, జపాన్, ఫిలిప్పీన్స్, టర్కీ దేశాల్లో తర్ఫీదు పొంది మన ప్లాంట్ అభివృద్ధికి ఎంతో చేశారని కొనియాడారు. అనేక అవార్డులు అందుకున్నారన్నారు. ఆయన్ను ఉద్యోగులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

63వ వార్డులో కార్పొరేటర్ పర్యటన



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ చిన్నా

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో మంగళవారం కార్పొరేటర్ గల్లా చిన్నా విస్తృతంగా పర్యటించారు. పాడి పశువులను మేపుతూ జీవనం సాగిస్తున్న సంఘానికి పలు మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. సంఘానికి అవసరమైన వసతులు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, రక్షణ గోడల ఏర్పాటుకు అధికారులతో కలిసి పరిశీలన జరిపారు. కార్యక్రమంలో ఈఈ ప్రసన్న, ఏఈ సంతోష్‌కుమార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రమేష్, వెటర్నరీ డాక్టర్ సునీల్, సంఘం ప్రెసిడెంట్ కుర్రు వెంకటరమణ, సెక్రటరీ అప్పలనాయుడు, వార్డు సెక్రటరీ గూడెల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రధాన కార్యదర్శిగా దాడి రమేష్

విశాఖ విద్య: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాడి పురుషోత్తమ రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు రమేష్ మంగళవారం విలేకరులకు తెలిపారు.

ఆకతాయిల బెడదపై దృష్టిపెట్టండి



సీఐ రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: కంచరపాలెం సీఐ కె. రవికుమార్‌ను మంగళవారం 56వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు, నాయకులు పల్లా ఎర్రికుమార్ యాదవ్, నమ్మి శశికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. మత్తుకు బానిస అవుతున్న యువతకు అవగాహన సదస్సులు నిర్వహించాలని, రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల పరిసరాల్లో ఆకతాయిల బెడద తగ్గించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. 56వ వార్డులో యువతకు ఫ్రెండ్లీ సదస్సులు నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ నుంచి సహకారం అందిస్తామని పల్లా ఎర్రికుమార్ తెలిపారు. ఈ నెల 28న సాయంత్రం గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం కమ్యూనిటీ హాలులో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ నేతృత్వంలో జరగనున్న 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు సీఐ రవికుమార్‌ను కోరారు.

ములగాడ మార్గానికి మోక్షం కల్పించండి

సీపీఎం నాయకుల పాదయాత్ర



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: ములగాడ మార్గంలో మారుతీ సర్కిల్‌కి వెళ్లాలంటే వాహనదారులకు నరకయాతనే అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలమైన ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్ మీదుగా మారుతీ సర్కిల్‌కు వెళ్లే మార్గాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఎం నాయకులు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మూసివేయడంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వారు ములగాడ మీదుగా మారుతీ సర్కిల్‌ను దాటుకుని నగరానికి చేరుకోవాల్సి వస్తుందన్నారు. అలాంటి మార్గం పూర్తిగా శిథిలావస్థలోఉందన్నారు. దీంతో వాహనదారులు రోజూ ఇబ్బంది పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వాహనాదారులు ఎదుర్కొంటున్న సమస్యపై అటు పోర్టు అధికారులకు,ఇటు పాలకులకు అనేక మార్లు వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా పాలకులు ఈ సమస్యపై స్పందించాలని లేకుంటే వాహనదారులతో కలిసి తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి,పెంటరావు,పైడిరాజు,రమణ,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ఎంతో గొప్పది



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

విశాఖ విద్య: ఒకరు చేసిన రక్తదానంతో నిండు ప్రాణాన్ని కాపాడవచ్చునని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. తొమ్మిదేళ్ల కిందట ఏఎన్ 32 విమాన ప్రమాదంలో మరణించిన ఎన్‌ఏడీ కార్మికుల జ్ఞాపకార్థం మంగళవారం ఎన్‌ఏడీ వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరంలో గణబాబు మాట్లాడారు. ముందుగా మృతులకు నివాళులర్పించారు. ప్రపంచంలో ఇప్పటి వరకూ రక్తం తయారు కావడం లేదని.. తోటి మనిషి రక్తం ఇస్తేనే లభిస్తుందని డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు అన్నారు. ఒక్కరు రక్తదానం చేయడం అంటే ముగ్గురు ప్రాణాలు కాపాడినట్టు అవుతుందన్నారు. ఎన్‌ఏడీ సీఈ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఏపీ థామస్ మాట్లాడుతూ రక్తదాన శిబిరం నిర్వహణకు యాజమాన్యం అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నించిందని, వాటిని అధిగమించి అధిక సంఖ్యలో కార్మికులు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారని అభినందించారు. రక్తదానం చేసిన వారికి యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

నూకరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, తిరుమలరావు, వర్క్స్ కమిటీ కార్యదర్శి డీవీ శ్రీనివాస్, ఎన్ఏడీ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి, అప్పలరాజు, కమిటీ సభ్యులు సత్యనారాయణ నాయుడు, మోహన్, సంతోష్ పాల్గొన్నారు.

ఎన్‌ఏడీలో వర్షం



వర్షంతో ఎన్ఎస్‌టీఎల్ రహదారి



జోరువానలోనూ పయనం

విశాఖ విద్య: నగరంలో ఎండ తీవ్రత కొనసాగుతోంది, దీనికి తోడు ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మంగళవారం ఉదయం ఎన్‌ఏడీ సెంటర్ పరిసరాల్లో కురిసిన వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. సుమారు పావుగంటకు పైగా కురిసిన ఈ జోరువానతో ఆ ప్రాంతం ఒక్కసారిగా చల్లబడింది. వర్షం కారణంగా రోజువారీ విధులకు హాజరయ్యే వారికి అసౌకర్యం కలిగినా, ప్రజలు వర్షంలోనే తమ ప్రయాణాన్ని కొనసాగించారు. ఆకాశంలో మబ్బులు కమ్మి, ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఎన్‌ఏడీ ఏరియాలో చల్లని గాలులతో ప్రజలు సేదతీరారు. నగరంలోని మిగతా ప్రాంతాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండగా, ఎన్‌ఏడీ ప్రాంతంలో మాత్రం వర్షం కారణంగా వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.